

ఇరుకు దారి..

రోడ్డు విస్తరణ చేపట్టకపోవడంతో కొత్తూరులో దారులన్నీ ఇరుగ్గా మారాయి. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. 10లో▸



చట్టం అమలుకు డిమాండ్

కనీస వేతన చట్టం అమలుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. 10లో▸



యువతే దేశ భవిష్యత్

దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని, దేశాభివృద్ధికి కృషి చేయాలని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

ఆదిబట్లలో 'అవిశ్వాసానికి' ముహూర్తం ఖరారు

- ఫిబ్రవరి 9న ప్రత్యేక సమావేశం
- ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలో అవిశ్వాసంపై అధికారులు స్పష్టతనిచ్చారు. కలెక్టర్ శశాంక పాలకవర్గం సభ్యులకు నోటీసులు అందజేశారు. ఫిబ్రవరి 9న మధ్యాహ్నం 12 గంటలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదేశాలు జారీ చేశారు. చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌తో పాటు పాలకవర్గం సభ్యులకు ఇప్పటికే నోటీసులు అందించారు. చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లను తొలగించడానికి ముహూర్తం ఖరారు చేశారు. ప్రత్యేక సమావేశంలో నూతన చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. ఇందు కోసం క్యాంపు రాజకీయాలు జోరందుకున్నాయి. 8వ వార్డు కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డిని చైర్మన్‌గా చేయడానికి సిద్ధమయ్యారు. ఇప్పటికే క్యాంపులో భాగంగా బెంగళూరు వెళ్లినట్లు సమాచారం. కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక సమావేశం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్తమ సేవలకు అవార్డు



అవార్డులు అందుకున్న బృందంలో షాద్‌నగర్ ఆర్డీఓ వెంకట మాధవరావు

షాద్‌నగర్: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తమ సేవలు అందించినందుకు గాను షాద్‌నగర్ ఆర్డీఓ వెంకట మాధవరావు గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా బెస్టు ఎలక్ట్రోరల్ ప్రాక్టీస్ అవార్డును అందుకున్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు అవార్డులు అందజేశారు.

పోలీస్ సేవలకు 'జాతీయ' గుర్తింపు



కేకేవీ రెడ్డి

బడంగ్‌పేట్: సీఆర్‌పీఎఫ్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా విధులు నిర్వర్తించిన కె.కె.వి. రెడ్డి జాతీయ స్థాయిలో ఉత్తమ పోలీస్‌గా ఎంపికయ్యారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో ప్రధాని చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకోనున్నారు. ఇటీవలే సీఆర్‌పీఎఫ్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్న ఆయన సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. 2015లోనూ ప్రధాని మోదీసాటు రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ ఉత్తమ పోలీసు అవార్డు అందుకున్నారు. 11 ఏళ్లపాటు స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్‌పీజీ)లో కూడా పనిచేశారు. ప్రస్తుతం ఆయన బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో సీబీఎస్‌ఈతో కూడిన ఎడిఫై స్కూల్‌కు సీఈవోగా వ్యవహరిస్తున్నారు.

నేటి నుంచి ఆనంద్ ఉత్సవ్

సాక్షి, సిటీబ్యూరో: ప్రతిష్టాత్మక ఆనంద్ ఉత్సవ్‌కు హైదరాబాద్ వేదికగా నిలిచింది. దక్షిణ భారతదేశంలో తొలిసారిగా ఈ ఉత్సవాలు ఇక్కడ నిర్వహిస్తున్నామని శ్రీనాథ్ జీ ధ్వజాజీ ఆనంద్ ఉత్సవ్ కమిటీ వెల్లడించింది. సనాతన ధర్మం విలువలు సమాజంలో మరింత మందికి తెలియజెప్పేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపింది. ఆనంద్ ఉత్సవ్ వేడుకలు నెక్లెస్‌రోడ్ జలవిహార్‌లో నేటి నుంచి ఈ నెల 28 వరకు జరగనున్నాయి. వేడుకల విశిష్టతను వివరించే పుస్తకాన్ని నిర్వాహకులు ఆవిష్కరించారు. రాజస్థాన్ ఉదయ్‌పూర్ శ్రీకృష్ణ ఆలయం నుంచి తెచ్చిన ధ్వజాజీని భక్తుల దర్శనం కోసం ఇక్కడ ఏర్పాటు చేయనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు చైతన్య తెలిపారు.

పబ్లిక్ గార్డెన్స్ కేంద్రంగా ట్రాఫిక్ మళ్లింపులు

రాజ్‌భవన్ రోడ్డులోనూ నిర్ణీత సమయంలో..

సాక్షి, సిటీబ్యూరో: గణతంత్ర వేడుకలు జరిగే పబ్లిక్ గార్డెన్స్ కేంద్రంగా శుక్రవారం ట్రాఫిక్‌ను మళ్లించనున్నట్లు గురువారం అదనపు సీపీ పి.విశ్వప్రసాద్ పేర్కొన్నారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయి. ఈ సమయంలో తాజ్ ఐలాండ్, చాపెల్ రోడ్ జంక్షన్, ఓల్డ్ సైఫాబాద్ పీఎస్ చౌరస్తా, బషీర్‌బాగ్ జంక్షన్, ఇక్బాల్ మీనార్, ఏఆర్ పెట్రోల్ పంప్, ఆదర్శ్‌నగర్ కేంద్రంగా సాధారణ వాహనాల రాకపోకలను మళ్లిస్తారు. గవర్నర్ అధికారిక నివాసం రాజ్‌భవన్‌లోనూ శుక్రవారం ఎట్ హోమ్ జరగనుంది. ఈ నేపథ్యంలో సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల మధ్య రాజ్‌భవన్ రోడ్డులోకి వచ్చే వాహనాలను మళ్లిస్తారు.

ప్రాణాలతో చెలగాటం!

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా (ప్రస్తుతం వికారాబాద్ జిల్లా) దోమ మండలం పాలెపల్లికి చెందిన ఇంటర్ విద్యార్థిని లక్ష్మి(18) జ్వరంతో బాధపడుతూ స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీ శివరాంను ఆశ్రయించింది. ఆయన గడువు తీరిన (అజిత్రోమైసిన్ 500 ఎంజీ) టాబ్లెట్ ఇచ్చారు. టాబ్లెట్ వేసుకున్న కొద్ది సేపటికే బాధితురాలు తీవ్ర అస్వస్థతకు గురైంది. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృత్యువాతపడింది. తల్లిదండ్రులు సదరు ఆర్‌ఎంపీపై పోలీసులుకు ఫిర్యాదు చేయగా, కేసు కూడా నమోదు చేశారు. ఇలాంటి ఘటనలు తరచూ వెలుగు చూస్తున్నా.. వాటిని నియంత్రించాల్సిన డ్రగ్ కంట్రోల్ అధికారుల్లో మాత్రం చలనం రావడం లేదు.

ఆయువు తీస్తున్న గడువు తీరిన మందులు

- జిల్లాలో విచ్చలవిడిగా నకిలీ విక్రయాలు
- ప్రిస్క్రిప్షన్ లేకుండానే యథేచ్ఛగా అమ్మకాలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: కొంత మంది ఫార్మాసిస్టులు, ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ధనార్జనే ధ్యేయంగా పని చేస్తున్నారు. తమ వద్దకు వచ్చే రోగులకు గుట్టుగా గడువు ముగిసిన, నిషేధిత జాబితాలో ఉన్న మందులను విక్రయిస్తున్నారు. సాధారణ జ్వరం, తల నొప్పి, కడుపు నొప్పి మందులే కాదు ప్రమాదకరమైన యాంటిబయాటిక్స్, పెయిన్ కిల్లర్లు, యాంటి డిప్రెషన్ మందులు, మత్తు ఇంజక్షన్లు, స్లీపింగ్ టాబ్లెట్స్, స్టెరాయిడ్స్, గర్భ విచ్ఛిత్తి మందులు అమ్ముతున్నారు. నిజానికి క్వాలిఫైడ్ డాక్టర్ ప్రిస్క్రిప్షన్ చూసిన తర్వాతే ఈ మందులు అమ్మాల్సి ఉంది. కానీ మెజార్టీ ఫార్మాసిస్టులు కనీసం ప్రిస్క్రిప్షన్ చూడకుండా ఇష్టం వచ్చినట్లు ఇచ్చేస్తున్నారు. కొన్ని ఫార్మసీలైతే ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇస్తే చాలు ఏకంగా ఇంటికే మందులు సరఫరా చేస్తున్నాయి. వీటిలో గడువు తీరిన, నిషేధిత జాబితాలో ఉన్న డ్రగ్స్ కూడా ఉంటున్నట్లు సమాచారం. దగ్గుకు వాడే సిరప్‌లలో కొంత మత్తు ప్రభావం ఉంటుంది. మాదకద్రవ్యాలు వినియోగించే వారు వాటికి బదులుగా వీటిని వాడుతున్నారు. కార్డియాక్, సైక్రియాట్రిక్స్, న్యూరాలజీ, బ్రెయిన్ స్ట్రోక్, అబార్షన్, డయాబెటిక్, బీపీ, స్లీపింగ్, యూరిన్ ఇన్‌ఫెక్షన్ తదితర రకాల మందులను డాక్టర్ రాస్తేనే మెడికల్ దుకాణాల నిర్వాహకులు అమ్మాలి. ప్రిస్క్రిప్షన్‌పై ఎన్ని రోజులకు రాస్తే అన్నే ఇవ్వాలి. మందుల చీటీపై షాప్ స్టాంప్ కూడా వేయాలి. దీంతో ఇతర చోట్ల కొనుగోలు చేయకుండా నిరోధించొచ్చు. రోగి సెల్‌నంబర్, చిరునామా కూడా బిల్లుపై పొందుపర్చాలి. అన్‌వాంటెడ్ ప్రెగ్నెన్సీ 72 గంటల పేరుతో ఉండే మందులను కూడా ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఇవ్వాలి. కానీ దుకాణ నిర్వాహకులు ఇవేమీ పాటించడం లేదు.

డీసీఏలకు నెలవారీగా మామూళ్లు ?

రాష్ట్ర వ్యాప్తంగా 45 వేలకుపైగా ఔషధ దుకాణాలు ఉండగా, వీటిలో గ్రేటర్ జిల్లాల్లోనే 25 వేల వరకు ఉన్నట్లు అంచనా. జిల్లాలోని మెజార్టీ ఫార్మసీల్లో టెన్త్, ఇంటర్ చదువుకున్న వారే. కొంతమంది వ్యాపారులు బీఫార్మసీ, ఎం ఫార్మసీ పూర్తి చేసిన నిరుద్యోగ అభ్యర్థుల నుంచి సర్టిఫికెట్లు అద్దెకు తీసుకుని, స్టోర్లు ఏర్పాటు చేసి, వాటిలో తక్కువ జీతానికి పని చేసే అభ్యర్థులను నియమించి మందులు విక్రయిస్తున్నారు. మరికొంత మందైతే ఏకంగా ఆహార ఉత్పత్తుల విక్రయానికి అనుమతులు తీసుకుని, వాటి మాటున ప్రమాదకరమైన ఇంజక్షన్లు విక్రయిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. నిజానికి డ్రగ్ కంట్రోల్ బోర్డు అధికారులు మూడు నెలలకోసారి విధిగా ఆయా షాపుల్లో తనిఖీలు నిర్వహించాల్సి ఉంది. ఏజెన్సీల నుంచి సరఫరా అవుతున్న మందులు, విక్రయాలు, గడువు ముగిసిన మందులను గుర్తించి, నోటీసులు జారీ చేయాలి. కానీ జిల్లాలోని డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఇవేవీ పట్టించుకోవడం లేదు. అడిగినంత ఇస్తే చాలు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆమనగల్లు, కడ్తాల్, షాద్‌నగర్, కేశంపేట, షాబాద్, యాచారం, మంచాల, చేవెళ్లలో ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతున్నట్లు తెలిసింది. ఫార్మసీల్లోనే కాదు ఆర్‌ఎంపీలు, పీఎంపీలు సైతం ఈ ప్రమాదకరమైన మందులు విక్రయిస్తున్నట్లు సమాచారం.

తనిఖీలు చేయాలి

డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ యాక్ట్–1940 ప్రకారం ప్రతి మెడికల్ షాపులో రిజిస్టర్డ్ ఫార్మాసిస్టు ఉండాలి. బీఫార్మసీ, ఎంఫార్మసీ, డీఫార్మసీ పూర్తి చేసిన అభ్యర్థులు రిజిస్టర్ చేసుకున్న వారు మాత్రమే దుకాణాలు నిర్వహించాల్సి ఉంటుంది. అనుమతి ఇచ్చే సమయంలో ఔషధ నియంత్రణ అధికారులు ఫార్మసిస్టు ఉన్నదీ, లేనిది పరిశీలించాలి. సంబంధిత ఏరియా ఇన్‌స్పెక్టర్లు కూడా తనిఖీలు చేయాలి. లేకపోతే షోకాజ్ నోటీసు జారీ చేయాలి. కెమిస్ట్ అండ్ డ్రగ్స్ ట్రేడర్లు ఇవేవీ పట్టించుకోవడం లేదు.

– ఆకుల సంజయ్ రెడ్డి, అధ్యక్షుడు, తెలంగాణ ఫార్మా సొసైటీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్

ఓటు ప్రాముఖ్యత తెలుసుకోవాలి

- అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

మహేశ్వరం: ఓటు ప్రాముఖ్యత ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటు ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టు, సామాన్యుడి చేతిలో వజ్రాయుధం అని, అలాంటి అమూల్యమైన ఓటును ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అంతకు ముందు మహేశ్వరం మండల కేంద్రంలో విద్యార్థులు, అధికారులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. గడికోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీపీ సునితానాయక్, తహసీల్దార్ మహమూద్ అలీ, ఎంపీడీఓ నర్సింహ, ఉప తహసీల్దార్ సవత, ఆర్‌ఐలు పావని, స్వర్ణ కుమారి, ఎంఈఓ కృష్ణ, ఎంపీఓ రవీందర్‌రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.ధనుంజయ్ పాల్గొన్నారు.

దూసుకొచ్చిన మృత్యు శకటం

- బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం
- తల్లీకుమారుల దుర్మరణం



పార్వతమ్మ, భాను (ఫైల్)

ఇబ్రహీంపట్నం: మృత్యుశకటంగా దూసుకొచ్చిన ఓ డీసీఎం తల్లీకుమారులను బలితీసుకుంది. ప్రమాదం జరిగిన తర్వాత నిలవకుండా వ్యాన్‌తోనే డ్రైవర్ ఉడాయించడంతో తల్లీకుమారులు విలవిల్లాడుతూ ఘటనా స్థలంలోనే ప్రాణాలు వదిలారు. ఈ విషాదకర సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మైబెల్లి తెలిపిన వివరాల ప్రకారం.. దండుమైలారం గ్రామానికి చెందిన తల్లీకుమారులైన రావుల పార్వతమ్మ (39), రావుల భాను(20) బైక్‌పై చౌదర్‌పల్లిలోని కూతురింటికి వెళ్తున్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని వైట్ గోల్డ్ కంపెనీ వద్ద రాగానే వీరి బైక్‌ను అతివేగంగా వస్తున్న డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తల్లీకుమారులు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారకుడైన డ్రైవర్ పారిపోయాడు. విషయం తెలిసి సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను ఇబ్రహీంపట్నం మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా మృత్యువాత పడిన భాను ఒగ్గు కథలు చెబుతూ కుటుంబానికి ఆసరాగా ఉండేవాడు. తల్లీకుమారుల మృతితో దండుమైలారంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



సభలో మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్

కేంద్ర విధానాలపై ఉద్యమిద్దాం

తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్

ఆమనగల్లు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారిపై రాజీవ్ చౌరస్తా వద్ద జరిగిన సభలో సాగర్ మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం రెండేళ్ల క్రితం రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలను తీసుకువచ్చిందని, ఏడాదిపాటు సాగిన ఆందోళనలతో దిగివచ్చి రద్దు చేసిందని గుర్తు చేశారు. దొడ్డిదారిన వాటిని అమలు చేయడానికి ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడానికి కుట్రలు కొనసాగుతున్నాయని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజాస్వామికవాదులంతా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్, కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, కార్యదర్శి జగన్, రాష్ట్ర కమిటీ సభ్యులు కుమార్, మల్లేశ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రమాద రహిత సమాజాన్ని నిర్మిద్దాం



మాట్లాడుతున్న శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి

- శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: వాహనదారులు రహదారి నియమాలను పాటించి ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు గురువారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో ట్రాఫిక్ ఎస్‌ఐ రవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో ఆర్టీసీ డ్రైవర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. రెప్ప పాటులో జరిగే పొరపాటు ప్రమాదాలకు దారి తీస్తుందని అన్నారు. వాహనాలను నడిపే సమయంలో డ్రైవర్లు ఏకాగ్రతతో ఉండాలని సూచించారు. వాహనాలను దాటే సమయంలో ముందు వెళ్తున్న వాహనాల వేగాన్ని అంచనా వేసుకొని వెళ్లాలని అన్నారు. మద్యం తాగి వాహనాలను నడపరాదని, మద్యం మత్తులో ఎంతో మంది ప్రమాదాల బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మనం బయటకు వెళ్తే ఎప్పుడు వస్తారా అని మనకోసం భార్య, పిల్లలు ఎదురు చూస్తుంటారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఉష, అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, ట్రాఫిక్ సిబ్బంది జితేందర్ రెడ్డి, నర్సింహగౌడ్, మల్లేష్, మస్తాన్‌వలీ, శ్రీకాంత్ రెడ్డి, శివకుమార్, శ్రీరాములు, ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

లిటరరీ ఫెస్టివల్‌కు సర్వం సిద్ధం

- నేటి నుంచి మూడు రోజుల పాటు హెచ్‌ఎల్‌ఎఫ్

సాక్షి, సిటీబ్యూరో: నగరం వేదికగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్'కు సర్వం సిద్ధమైంది. నేటి నుంచి ఆదివారం వరకు హైటెక్ సిటీలోని సత్వ నాలెడ్జ్ సిటీ వేదికగా ఫెస్ట్ కొనసాగనుంది. సాహిత్యం, సంస్కృతి, సామాజిక అంశాలపై పలు చర్చా కార్యక్రమాలు, ప్రముఖ సాహితీవేత్తల ప్రసంగాలు, ఆయా రంగాల్లోని ఔత్సాహికుల విభిన్న కార్యక్రమాలతో మూడు రోజుల పాటు వైవిధ్యభరిత సాహితీ పండగను నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు పుస్తక పరిచయాలు, ఆవిష్కరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, యువ రచయితల అవగాహన చర్చలు, విభిన్న కళలకు చెందిన ఆర్టిస్టుల ప్రత్యేక కార్యక్రమాలతో సాహితీ– కళా వైభవం ఆకట్టుకోనుంది.

వీరు మారరు..

మరో ప్రాణం తీసిన డ్రంకన్ డ్రైవింగ్

- కేసులు నమోదు చేస్తున్నా మారని మందుబాబులు
- సిబ్బంది కొరతతో డ్రైవ్‌లకు ఇబ్బందులు
- రానున్న రోజుల్లో కఠిన చర్యలకు నిర్ణయం



గత ఏడాది డ్రంక్ డ్రైవింగ్ కేసులు

- మొత్తం కేసులు: 37,866
- చార్జ్‌షీట్ దాఖలు చేసినవి: 37,956 (పాత వాటితో కలిపి)
- మందుబాబులకు విధించిన జరిమానా: రూ.8,22,83,024
- జైలుశిక్ష పడినవాళ్లు: 3,782
- డ్రైవింగ్ లైసెన్స్ రద్దయినవాళ్లు: 556

సాక్షి, సిటీబ్యూరో: కొన్నిరోజుల క్రితం డీకే నగర్‌లో స్టూడెంట్ దేవి.. ఆ మధ్య పంజగుట్ట వద్ద చిన్నారి రమ్య కుటుంబం.. తాజాగా జూబ్లీహిల్స్‌లో బౌన్సర్ తారక్.. సంచలనం సృష్టించి, రికార్డులకెక్కిన 'డ్రంక్ డ్రైవింగ్' ప్రమాదాలు ఇవి. వీటికి తోడు వెలుగులోకి రాని ఉదంతాలెన్నో. గతంలో ప్రమాదాలకు భిన్నంగా.. బుధవారం నాటి ప్రమాదం ఉద్రిక్తతలకు దారి తీసింది. సీసీ కెమెరాలకు కూడా నంబర్ ప్లేట్ చిక్కని వేగంతో కారు నడిపి, బౌన్సర్ తారక్ మృతికి కారణమైన రిత్విక్ రెడ్డి కూడా మద్యం మత్తులో ఉన్నట్లు జూబ్లీహిల్స్ పోలీసులు గురువారం ప్రకటించారు. పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, ఏటా ఎందరు జైలుకు వెళ్తున్నా, నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా మందుబాబుల్లో మాత్రం మార్పు రావడంలేదు.

వేధిస్తున్న సిబ్బంది కొరత..

రాత్రి వేళల్లో మద్యం తాగేవారికి, ఆ స్థితిలో వాహనాలు నడిపే వారికి సమయం, సందర్భం అంటూ ఉండదు. డ్రంక్ డ్రైవింగ్ పరీక్షలు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులకు మాత్రం ఇవి ఉంటాయి. ప్రధానంగా వీకెండ్స్‌గా పిలిచే శుక్ర, శనివారాల్లో రెగ్యులర్‌గా, మిగిలిన సమయాల్లో ఆకస్మికంగా ఈ తనిఖీలు చేపడుతున్నారు. ఈ డ్రైవ్స్ నిర్వహణకూ నిర్ణీత సమయం ఉంటోంది. ఎప్పుడైనా కానీ కొన్ని గంటలు మాత్రమే చేపట్టగలుగుతున్నారు. ఈ విధులు నిర్వర్తించిన, పర్యవేక్షించిన వారే మరునటి రోజూ విధులకు హాజరుకావాల్సి ఉండటంతో ఇలా చేయాల్సి వస్తోంది. ట్రాఫిక్ విభాగంలో ఉన్న సిబ్బంది కొరత నేపథ్యంలో ప్రతి రోజూ, రాత్రంతా డ్రంక్ డ్రైవింగ్ తనిఖీలు చేపట్టలేకపోతున్నారు. దీన్నే మందుబాబులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు.

తెలివిమీరుతున్న మందుబాబులు..

ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించే రోజులు, సమయాలు, స్థలాలను గమనిస్తున్న మందుబాబులు తెలివిమీరి ప్రవర్తిస్తున్నారు. డ్రంక్ డ్రైవింగ్‌పై తనిఖీలు ఉండని రోజుల్లో, సమయాల్లో రెచ్చిపోతున్నారు. అవి జరిగే వారాంతాల్లోనూ గల్లీలు, ఇతర మార్గాలను అనుసరిస్తూ పోలీసులకు చిక్కట్లేదు. కొందరైతే ఏకంగా వాట్సాప్ గ్రూపుల్లో డ్రంక్ డ్రైవింగ్ జరిగే ప్రాంతాలు, సమయాలకు సంబంధించిన సమాచార మార్పిడి చేసుకుంటూ వాహనాలపై దూసుకుపోతున్న సందర్భాలూ ఉన్నాయి. ఇదే అనేక సందర్భాల్లో ప్రమాదహేతువుగా మారుతోంది. మద్యం తాగి వాహనం నడుపుతూ తామంతట తాము ప్రమాదానికి లోనైన ఉదంతాలు అసలు వెలుగులోకే రావడం లేదు. ఎదుటి వారిని ఢీకొట్టినప్పుడో, సంచలనాత్మక ఉదంతం జరిగినప్పుడో మాత్రమే ఈ విషయం వెల్లడవుతోంది.

తీవ్రమైన సెక్షన్లతో కేసులు..

సాధారణంగా రోడ్డు ప్రమాద సంబంధ ఉదంతాలు చోటు చేసుకున్నప్పుడు పోలీసులు ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ)లోని సెక్షన్ 304 (ఎ) కింద కేసు నమోదు చేస్తారు. డ్రంక్ డ్రైవింగ్ చేస్తూ ఎదుటి వారి మరణానికి కారణమైన వారిపై ఐపీసీలోని సెక్షన్ 304 (పార్ట్–2) కింద కేసు నమోదు చేయడం ప్రారంభించారు. '304 ఏ' అంటే నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా ఓ ప్రాణం పోవడానికి కారణం కావడం. అయితే మద్యం తాగి వాహనం నడుపుతున్న వ్యక్తిపై కేసు నమోదుకు ఐపీసీలోని 304 పార్ట్ 2 సెక్షన్ సరిగా సరిపోతుందని పోలీసులు నిర్ధయించారు. అంటే మద్యం తాగిన సదరు వ్యక్తి తన డ్రైవింగ్‌తో ఎదుటి వారికీ ప్రాణహాని ఉంది అని తెలిసీ పట్టించుకోకపోవడమని అర్థం. ఇలాంటి కేసుల్లో బెయిల్ సైతం తొందరగా లభించదు. న్యాయస్థానంలో నిరూపితమైతే గరిష్టంగా పదేళ్ల నుంచి జీవిత ఖైదు లేదా జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంది. ఈ సెక్షన్ కింద నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్ సైతం లభించదు.

ప్రమాదం జరిగితే పక్కా చర్యలు..

తాజా పరిణామాల నేపథ్యంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వ్యక్తి వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలతో పాటు ఇతర ప్రమాదాల్లోనూ మద్యం పరీక్షలు తప్పనిసరి చేస్తున్నారు. దాదాపు ప్రతి రోడ్డు ప్రమాదం కేసులోనూ దానికి బాధ్యులైన వ్యక్తికి శాంతిభద్రతల విభాగం అధికారులు ట్రాఫిక్ పోలీసుల సాయంతో తక్షణమే బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేసేలా చర్యలు తీసుకోనున్నారు. దీంతో పాటు ఈ ఏడాది ప్రారంభం నుంచి డ్రగ్ పరీక్షలు, అవసరమైన సందర్భాల్లో రక్తనమూనాలు సేకరించి పరీక్షలు చేయించడం ద్వారా వైద్యులు ఇచ్చే పత్రాలను కేసు ఫైల్‌లో చేరుస్తున్నారు. సదరు వ్యక్తి మద్యం తాగి ఉన్నట్లు తేలితే... 304 పార్ట్ 2 తదితర సెక్షన్లను జోడిస్తున్నారు. ప్రమాదం 21 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్న వారి వల్ల జరిగితే.. వారు మద్యం తాగిన బార్/పబ్, విక్రయించిన వైన్ షాపు లైసెన్సు రద్దుకు సిఫార్సు చేసేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తి/డ్రంకన్ డ్రైవ్‌లో చిక్కిన ఉల్లంఘనులు డ్రైవింగ్ లైసెన్స్ లేని వారైతే ఆ వాహనం ఎవరి పేరిట ఉందో ఆ యజమానిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు.

వేతన చట్టం అమలుకు డిమాండ్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కార్మికులు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

షాద్‌నగర్: కనీస వేతన చట్టం అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలోని పార్కులో సీఐటీయూ, రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 16న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం రాజు మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుగుణంగా చట్టాలను రూపొందిస్తుందన్నారు. ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. రైతు కుటుంబాలకు రుణభారం నుంచి విముక్తి కల్పించాలన్నారు. కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించడంతో పాటుగా రైల్వే, రక్షణ విద్యుత్ సహా ప్రభుత్వ రంగ సంస్థల ప్రవేటీకరణ ఆపాలన్నారు. ఉద్యోగాల్లో కాంట్రాక్ట్ పద్ధతిని రద్దు చేయాలన్నారు. డిమాండ్ల సాధన కోసం ఫిబ్రవరి 16న సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల కార్మికులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు శ్రీను నాయక్, రవి, యాదయ్య, బాల్‌రాజ్, దశరథ్, రాజు, లలిత, శ్రీనివాస్, చంద్రకళ, పుష్ప, విజయ, సరిత, సక్కుబాయి, మంజుల రజిత, ఖాలేదా, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ బ్లాస్టింగ్‌పై కేసు నమోదు

యాచారం: వ్యవసాయ పొలంలో అక్రమ బ్లాస్టింగ్ చేస్తున్నందుకు ముగ్గురిపై యాచారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని అయ్యవారిగూడెంలో కన్నయ్యచారి వ్యవసాయ పొలంలో గురువారం అనుమతులు లేకుండా బండరాళ్లకు రంధ్రాలు పెట్టి బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్నారు. సమాచారం మేరకు పోలీసులు వెళ్లగా దేరంగుల మల్లేశ్, దేరంగుల సత్యనారాయణ, వరికుప్పల పెద్దయ్యలు బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్నారు. వారి వద్ద నుంచి పేలుడుకు ఉపయోగించే 41 జిలెటిన్స్, 90 డిటోనేటర్లు, కంప్రెషర్ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నైదయ్య తెలిపారు.


విరబూసిన ఫలరాజు

మండల పరిధిలోని బొబ్బిలిగామ, కుర్వగూడ, తాళ్లపల్లి గ్రామాల సమీపంలో మామిడి పూత విరగబూసింది. పూత బంగారం వలె ధగధగ మెరుస్తూ చూపరులను ఆకట్టుకుంటోంది. గతేడాది మామిడి చెట్లకు కాత అంతంత మాత్రంగానే కాసింది. ఈసారి ఎక్కడ చూసినా మామిడి పూత విరగ బూసింది. గురువారం 'సాక్షి' కెమెరా ఈ చిత్రాలను బంధించింది. - షాబాద్



యువతి అదృశ్యంపై కేసు నమోదు

కడ్తాల్: యువతి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని మక్త మాధారంలో వెలుగు చూసింది. సీఐ శివ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన స్వర్ణకంటి కల్యాణి(19) ఈ నెల 11న ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెళ్లిపోయింది. దీంతో ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికినా లభించలేదు. ఈ మేరకు గురువారం కల్యాణి తల్లి బావమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.



కల్యాణి (ఫైల్)

కీచక తండ్రికి జీవిత ఖైదు

అబ్దుల్లాపూర్‌మెట్: మద్యం మత్తులో కన్న కూతురి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి కోర్టు జీవిత ఖైదుతో పాటు రూ.25 వేల జరిమానా విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గండిచెరువుకు చెందిన దేశగోని ఆనంద్‌గౌడ్ (34)కు ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరగగా.. కుమారుడు, కూతురు సంతానం. గతేడాది అక్టోబర్ 22న ఇంట్లో ఎవరూ లేని సమయంలో కూతురు పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక ఈ విషయాన్ని తల్లికి చెప్పడంతో ఆమె పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో హాజరుపర్చారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి ఎల్‌బీనగర్‌లోని 9వ అదనపు, స్పెషల్ పోక్సో జడ్జి హరీష గురువారం నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.25 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో శిక్ష పడేందుకు కృషి చేసిన సిబ్బందికి రాచకొండ సీపీ సుధీర్‌బాబు రివార్డు ప్రకటించారు.

ఇరుకు దారి.. ఇక్కట్లుగా మారి

రోడ్డు విస్తరణ చేపట్టకపోవడంతో కొత్తూరు పట్టణంలో దారుల్నీ ఇరుకుగా మారాయి. చిరు వ్యాపారుల దుకాణాలు, అడ్డా కూలీల కేంద్రంగా మారిన కూడళ్ల వద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పొంచి ఉన్న ప్రమాదాన్ని గ్రహించి అధికారులు రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

- కొత్తూరులో స్థానికుల అవస్థలు
- రాకపోకలకు తీవ్ర ఆటంకం



బస్సులు వెళ్లడానికి దారిలేని చోట కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

కొత్తూరు: పట్టణంలోని పాత జాతీయ రహదారి నుంచి నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. దానికి తోడు పక్కన ఉన్న దర్గా రోడ్డు గుండా వాహనదారులు అధిక సంఖ్యలో తిరుగుతుంటారు. ఈ రెండు రోడ్లకు ఇరువైపులా నిత్యం కూరగాయలు, పండ్లు విక్రయించేందుకు ఉదయం, సాయంత్రం వేళలో చిరు వ్యాపారులు దుకాణాలను నెలకొల్పుతున్నారు. ప్రమాదవశాత్తు ఏదైనా వాహనాలు అదుపు తప్పితే నేరుగా దుకాణాలు, ప్రజలపైకి దూసుకొచ్చే అవకాశం ఉంది. ప్రమాదకరంగా మారిన కూడళ్లలో వ్యాపారులతో పాటు అమాయక ప్రజలకు సైతం ముప్పు పొంచి ఉంది. అధికారులు నిర్లక్ష్యాన్ని వీడకుంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో ఓ లారీ అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకురావడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు.

రోడ్డు పక్కనే విక్రయాలు..

పట్టణంలోని దర్గా, పాత జాతీయ రహదారికి ఇరువైపులా పండ్లు, కూరగాయల దుకాణాలను నిర్వహిస్తున్నారు. కొందరు రైతులు అనువైన స్థలం లేక రోడ్డుపైనే దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. స్థానికంగా పరిశ్రమలు ఉండడంతో ప్రతి ఆదివారం పట్టణంలో వారంతపు సంత కొనసాగుతోంది. ఇక్కడ వందల సంఖ్యలో చిరువ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేయగా.. కార్మికులు తమకు కావాల్సిన సరుకులు కొనుగోలు చేస్తుంటారు.

అదుపు తప్పితే అంతే..

పాత జాతీయ రహదారి, దర్గా రోడ్డులో దుకాణాలకు తోడు రోజూ ఉదయం అడ్డా కూలీలు వందల సంఖ్యలో రోడ్డుపైనే పనుల కోసం ఎదురు చూస్తున్నారు. వాహనం రాగానే దాని చుట్టూ గుమిగూడి పనులు మాట్లాడుకునే సందర్భంలో ఎదురుగా వచ్చే వాహనాలను పట్టించుకోవడం లేదు. దీంతో రోడ్డు పక్కకు జరగాలని కోరగా కూలీలు, వాహనదారులకు మధ్యన గొడవలు, ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు ఇరుకుగా ఉండడం.. దానికి తోడు సరైన ట్రాఫిక్ నిబంధనలు పాటించని కారణంగా వాహనాల రాకపోకలు ఇష్టానుసారంగా మారాయి.

త్వరలోనే పరిష్కరిస్తాం...

పట్టణంలోని పాత జాతీయ రహదారితో పాటు దర్గా రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు, పండ్ల దుకాణాలను ఏర్పాటు చేసుకున్న చిరువ్యాపారులకు ఇప్పటికే ప్రమాదాలపై అవగాహన కల్పించాం. రోడ్డుకు దూరంగా దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించాం. అంతేకాకుండా అడ్డా కూలీలతో సైతం ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసులతో చర్చించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి కృషి చేస్తున్నాం.
- రవీందర్‌నాయక్, ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ, షాద్‌నగర్

మట్టి తరలిస్తున్న వాహనాల పట్టివేత

ఇరువురిపై కేసు నమోదు



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

కేశంపేట: అక్రమంగా చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న జేసీబీ, టిప్పర్ వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసిన సంఘటన మండల పరిధిలోని చింతకుంటపల్లిలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని చెరువు నుంచి కొందరు వ్యక్తులు టిప్పర్లు, జేసీబీ సహాయంతో మట్టిని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. గ్రామానికి చెందిన మల్లేశ్‌యాదవ్ ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు సైతం చేశారు. ఈ మేరకు పోలీసులు దాడి చేసి అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్లు పాండు, లింగ్యాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చేవెళ్ల: మండలంలోని తంగడపల్లి గ్రామ సమీపంలో చెట్ల కింద పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామ సమీపంలో చెట్ల కింద కొంతమంది పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం రావటంతో దాడి చేశారు. ఏడుగురిని పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీరబ్రహ్మం తెలిపారు.

సీఐకి సన్మానం

శంషాబాద్ రూరల్: శంషాబాద్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న ఎస్.శ్రీనాథ్‌ను గురువారం స్థానికులు కలిసి సన్మానించారు. బీఆర్‌ఎస్ పార్టీ ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు నేనావత్ లాల్‌సింగ్‌నాయక్ ఆయనకు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్.రతన్, భరత్, తుల్సిరాం, హన్మంతు, మున్నా, వినోద్, అజయ్, చిన్నా, విజయ్ పాల్గొన్నారు.

యువతే దేశ భవిష్యత్



యువ ఓటర్ల సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేవైఎం నాయకులు

చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని, దేశాభివృద్ధికి కృషి చేయాలని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గుడిపల్లి నితీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన ఓటర్ల సమ్మేళనంలో ప్రధాని మోదీ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఓటు సక్రమంగా యువత వినియోగించుకోవాలన్నారు. ఓటు విలువ తెలుసుకొని ప్రజలను చైతన్యం చేయాలన్నారు. దేశ అభివృద్ధే లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగాలని సూచించారు. కొత్తగా ఓటు వేసే వారికి విధివిధానాలను వివరించారు. ఓటు హక్కు నమోదు చేసుకోని వారు వెంటనే ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. నూతన ఓటర్ల కోసం బీజేవైఎం ఈ కార్యక్రమం నిర్వహించటం ఎంతో సంతోషకరమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కంజర్ల ప్రకాశ్, ప్రభాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నాయకులు అనంత్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీకాంత్, మధుసూదన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శైసింహ, బీజేవైఎం నాయకులు, యువకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

భారతి సిమెంట్‌కు తిరుగు లేదు

బడంగ్‌పేట్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్‌ను విడుదల చేసినట్లు ఆ సంస్థ సీనియర్ టెక్నికల్ ఇంజినీర్ నితీష్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు గురువారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్‌లోని డీలర్ షాప్‌లో తాపీ మేస్త్రీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నితీష్ మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా పూర్తవుతుందన్నారు. స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారుల నిర్మాణానికి సరైన ఎంపిక భారతి సిమెంట్ అన్నారు. వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందచేస్తామని తెలిపారు. అనంతరం తాపీ మేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా బాండ్లను అందచేశారు. కార్యక్రమంలో డీలర్ దశరథ, టెక్నికల్ మార్కెటింగ్ మేనేజర్ రామకృష్ణ, టెక్నికల్ ఆఫీసర్ బుద్ధి, 45 మందికి పైగా తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.



ఇన్సూరెన్స్ చెక్‌ను అందజేస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

ముగిసిన హెచ్‌ఆర్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్

సాక్షి, సిటీబ్యూరో: ఐఎంటీ హైదరాబాద్‌లో జరుగుతున్న హెచ్‌ఆర్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్ గురువారం ముగిసింది. 'ఎంపవరింగ్ ఫ్యూచర్ వర్క్‌ఫోర్స్ స్ట్రాటజీస్ ఫర్ ఇన్‌క్లూజివ్ లీడర్‌షిప్' థీమ్‌తో నిర్వహించిన ఈ సదస్సులో ప్రొఫెసర్ వెంకట చక్రపాణి మాట్లాడుతూ.. హెచ్‌ఆర్ భవిష్యత్తు తీర్చిదిద్దటంలో నాయకత్వం పాత్ర కీలకమని నొక్కిచెప్పారు. 'వర్క్‌ఫోర్స్ మెటామార్ఫోసిస్: ది బిగ్ షిఫ్ట్' అంశంపై గాన్యూల్స్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన ఉమారావు గండూరి మాట్లాడుతూ.. సమకాలీన ఉద్యోగ రంగాన్ని నడిపించే కీలక అంశాలను గురించి వెల్లడించారు. కార్యక్రమంలో ఐఎంటీ హైదరాబాద్ ఏరియా చైర్‌పర్సన్ హెచ్‌ఆర్ ప్రొఫెసర్ రోమినా మాథ్యూతో పాటు పలువురు భిన్న రంగాల ప్రముఖులు పాల్గొని మాట్లాడారు. ఐఎంటీ హైదరాబాద్‌కు చెందిన హ్యూమన్ రిసోర్స్ క్లబ్ సినర్జీ, కాన్‌క్లేవ్‌ను నిర్వహించడంలో కీలక పాత్ర పోషించింది.



సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

అస్వస్థతతో ఉపాధి కూలి మృతి

కడ్తాల్: అస్వస్థతకు గురై ఉపాధిహామీ కూలి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గోవిందాయిపల్లితండాలో గురువారం చోటు చేసుకుంది. సర్పంచ్ సభావట్‌రాము తెలిపిన వివరాల ప్రకారం.. గోవిందాయిపల్లితండాకు చెందిన కేతావత్ రాములు నాయక్(44) గురువారం ఉదయం గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధిహామీ కూలీకి వెళ్లారు. పనులు ముగించుకొని తిరిగి వస్తుండగా ఆయన తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కడ్తాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడిది నిరుపేద కుటుంబమని, బాధితులను ప్రభుత్వమే ఆదుకోవాలని సర్పంచ్ రాము కోరారు.



రాములునాయక్ (ఫైల్)

గ్రామ పంచాయతీలో చోరీకి యత్నం



ధ్వంసమైన బీరువాను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

నందిగామ: మండల పరిధిలోని చాకలిగుట్ట తండా గ్రామ పంచాయతీ కార్యాలయంలోకి గురువారం దుండగులు చొరబడ్డారు. నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కథనం ప్రకారం.. గ్రామ పంచాయతీలోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించారు. బీరువాను ధ్వంసం చేసి వస్తువుల కోసం వెతికారు. ఏమీ లభించకపోవడంతో స్టోర్ రూంలోని క్రికెట్ కిట్‌ను ఎత్తుకెళ్లిపోయారు. సంఘటన స్థలాన్ని ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామ కార్యదర్శి శ్రీనివాసచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారే ఈ ఘటనకు పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఇద్దరు వ్యక్తులు ఈ దొంగతనానికి యత్నించినట్లు సీసీ కెమెరాలో గుర్తించారు. వీటి ఆధారంగా కేసును ఛేదిస్తామని ఆయన తెలిపారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

శంషాబాద్ రూరల్: రౌడీషీటర్లుగా రికార్డుల్లో నమోదైన వారు నేరాల వైపు ఆలోచన చేయకుండా మంచి ప్రవర్తనతో మెలగాలని ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనాథ్ సూచించారు. గురువారం వారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఈ మేరకు హెచ్చరిక జారీ చేశారు.